www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 5 జనవరి 2023

5

తూర్పుగోదావరి

ఫిబ్రవరి 11న లోక్ అదాలత్

ప్రజాశక్తి – కొవ్వూరు రూరల్

ఫిబ్రవరి 11న నిర్వహించే లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని 9వ అదనపు జిల్లా జడ్జి పి.అన్నపూర్ణ తెలిపారు. బుధవారం 9వ అదనపు జిల్లా కోర్టు హాలులో పోలీసులు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ లోక్ అదాలత్‌లో రాజీ పడదగ్గ అన్ని క్రిమినల్ కేసులను కూడా పరిష్కరిస్తారన్నారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వర రావు, 2వ అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కె.శారదాంబ, కొవ్వూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.సూర్యనారాయణ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు సరే అధికారం ఏదీ?

పంచాయతీ కార్యదర్శి చెప్పింది చేయాల్సిందే... ఆందోళనలో సచివాలయ కార్యదర్శులు

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం ప్రతినిధి

గ్రామాల్లో సచివాలయ సెక్రటరీలు డిడిఒ పవర్స్ కోసం ఎదురు చూస్తున్నారు. గ్రామ స్థాయిలో పరిపాలన ప్రజలకు మరింత చేరువ చేసేందుకు సచివాలయాలను ఏర్పాటు చేసిన విషయం విదితమే. ఈ వ్యవస్థ ప్రారంభమై మూడేళ్ళ గడిచాయి. అయినా సచివాలయ కార్యదర్శులకు బాధ్యతలు తప్ప అధికారం ఇవ్వలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సచివాలయ పరిధిలో బాధ్యతలను సచివాలయ కార్యదర్శులకు అప్పగించారు. ఇతర శాఖల సిబ్బందిని సమన్వయ చేసుకుని ప్రజలకు సేవలందిస్తున్నారు. ప్రతి మండలంలోనూ పదుల సంఖ్యలో సచివాలయ కార్యదర్శులున్నా.. వీరికి ఎటువంటి అధికారాలు లేవు. ఏం కావాలన్నా పంచాయతీ కార్యదర్శిని ఆశ్రయించాల్సిన పరిస్థితి. పంచాయతీ కార్యదర్శి ఏం చెబితే.. అది చేయడమే. దీంతో సచివాలయ కార్యదర్శులు కేవలం పర్యవేక్షణకే పరిమితమయ్యారు.

తూర్పుగోదావరి జిల్లాలో 300 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రస్తుతం 185 మంది పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారు. మిగిలిన 163 చోట్ల ఇన్‌ఛార్జులతో నెట్టుకొస్తున్నారు. అలాగే జిల్లాలో 393 గ్రామ సచివాలయాలు ఉండగా సుమారు 300 మంది సచివాలయ కార్యదర్శులు ఉన్నారు. వారికి ప్రభుత్వం విధులు అప్పగించకపోవడంతోపాటు ప్రజలతో పాటు ఉద్యోగులలోనూ అసంతృప్తి వ్యక్తమవుతోంది. గ్రామాల్లో సాల్వెన్సీ సర్టిఫికెట్లు, జననమరణ ధ్రువీకరణ పత్రాలు, భవన నిర్మాణాలకు అనుమతులు, పంచాయతీల్లో అభివృద్ధి పనులకు నిధులు, సచివాలయ ఉద్యోగుల, వాలంటీర్ల జీతాలు ఇలా ఏ పని చేయాలన్నా పంచాయతీ కార్యదర్శి అనుమతి తీసుకోవాల్సి వస్తుంది. అయితే ప్రభుత్వం కొత్తగా నియమించిన సచివాలయ కార్యదర్శులకు వీటిలో ఏ ఒక్క పనితో సంబంధం లేదు. ఏం చేయాలన్నా పంచాయతీ కార్యదర్శి చేయాల్సిందే. ఆయన సంతకం ఉంటేనే మంజూరవుతాయి. ప్రభుత్వం ఏ నివేదిక అడిగినా కార్యదర్శి అనుమతితోనే వెళ్లాల్సి ఉంటుంది. కళ్లెదుట సచివాలయ కార్యదర్శులున్నా ప్రతి పనికి పంచాయతీ

కార్యదర్శి కోసం ప్రజలు ఎదురుచూడాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్య పర్యవేక్షణ, పన్నుల వసూళ్ల తదితర బాధ్యతలు అప్పగిస్తున్నారు. ప్రభుత్వం మాత్రం అధికారాలను ఎటువంటి విధులు అప్పగించకపోవడంతో సచివాలయ కార్యదర్శులు నిస్సహాత వ్యక్తం చేస్తున్నారు. పవర్‌లేని ఉద్యోగం చేయలేకపోతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు డిడిఒ పవర్స్ కల్పించాలని కోరుతున్నారు.

ప్రభుత్వ పరిశీలనలో ఉంది

డిడిఒ కోడ్ కేటాయింపు జిల్లా పరిధిలో ఉండదు. ప్రభుత్వ పరిశీలనలో ఉంది. జిల్లాలో రెగ్యులర్, ఇన్‌ఛార్జి కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. ప్రజా విజ్ఞప్తులపై ఎప్పటికప్పుడు స్పందిస్తున్నారు. ప్రస్తుతం ఇన్‌ఛార్జి కార్యదర్శి ఉన్న పంచాతీలో సిబ్బంది జీతభత్యాలు, ఇతర పంచాయతీ నిర్వహణ నిధుల బిల్లులు తప్ప.. మిగతా పనులు సచివాలయ కార్యదర్శులే చేస్తున్నారు.

- జగదాంబ.

జిల్లా పంచాయతీ అధికారి, తూర్పుగోదావరి

ర్యాలీలపై నిషేధం అప్రజాస్వామికం

సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం సిటీ

రాష్ట్రంలో రోడ్‌షోలు, ర్యాలీలపై నిషేధం అప్రజాస్వామికమని,రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒ 1ను తక్షణమే ఉపసంహరించుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది. సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.పవన్ ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికే ఈ జిఒను తీసుకొచ్చిందన్నారు. పోలీసులకు సర్వాధికారాలు కట్టబెట్టడం ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాదమన్నారు. పోరాడి సాధించుకున్న పౌరహక్కుల్ని ఏ పేరుతో అణిచివేసినా సిపిఎం వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. కందుకూరు, గుంటూరు ఘటనలను ఆసరా చేసుకొని రాష్ట్ర, మున్సిపల్, పంచాయతీ రోడ్‌లలో సభలు, ర్యాలీలు, రోడ్ షోలు నిషేధించడం తగదన్నారు. రోడ్లపైన ర్యాలీలు, సభలు జరిపితే ఇబ్బందులు ఘటనలు జరుగుతున్నాయనుకుంటే గుంటూరులో గ్రౌండ్‌లో సభ జరిపినప్పటికీ దుర్ఘటన జరగడంలో పోలీసుల వైఫల్యం స్పష్టంగా కనపడుతోందని పేర్కొన్నారు. ఇప్పటికే కార్మికులు, రైతులు, ప్రజలు తమ కోర్కెలు, హక్కుల కోసం ఆందోళనలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం అణచివేస్తోందని, ముందస్తు అరెస్టులు చేస్తూ సభలకు, ర్యాలీలకు అనుమతినివ్వడం లేదని తెలిపారు. ఉన్న గ్రౌండ్సను కూడా ప్రభుత్వం ఆక్రమించుకొని పట్టణాల్లో ఖాళీ స్థలమన్నది లేకుండా చేస్తుందన్నారు. ఊరికి దూరంగా ప్రజలతో సంబంధం లేకుండా సభలు ఎలా జరుపుకుంటారని ప్రశ్నించారు. ఈ జిఒను అమలు చేయడమంటే ప్రజలు, ప్రతిపక్షాలు, ప్రజాతంత్రవాదుల నోరు నొక్కే ప్రయత్నమేనని తెలిపారు. నిరసన తెలియజేసే హక్కును కూడా ఈ జిఒ హరిస్తుందన్నారు. అప్రజాస్వామికమైన ఈ జిఒను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాతంత్రవాదులు, అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, పౌరహక్కుల సంఘాలు, న్యాయకోవిదులు దీన్ని వ్యతిరేకిస్తూ ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

సావిత్రిబాయిపూలే సేవలు మరువలేనివి

ప్రజాశక్తి – కడియం, దేవరపల్లి

నేడు భారతదేశంలో మహిళా వికాసానికి, మహిళా విద్యకు సావిత్రిబాయిపూలే చేసిన సేవలు మరువలేనివని ఎంఇఒ వి.లజపతిరాయ్ అన్నారు. తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే జయంతి వారోత్సవాలు వేమగిరి తోట ప్రాథమిక

కడియంలో సావిత్రిబాయిపూలే జయంతిలో పాల్గొన్న ఉపాధ్యాయులు

పాఠశాలలో బుధవారం ఘనంగా జరిగాయి. హెచ్‌ఎం కె.జయరాజ్ మాట్లాడుతూ సావిత్రిబాయిపూలేను అందరూ ఆదర్శనీయంగా తీసుకోవాలన్నారు. ఆమె పుట్టినరోజును మహిళా ఉపాధ్యాయ దినోత్సవ జరపటం ఎంతో ముదావాహం అన్నారు. బోధనా రంగంలో విశిష్ట సేవలందించిన యాతం నాగమణి, కుమారి, పావనిలను ఘనంగా సత్కరించారు. వారు చేస్తున్న కషిని కొనియాడారు. చిన్నారి ప్రదర్శించిన సావిత్రిబాయి పూలే ఏకపాత్రాభినయం అందరిని అబ్బురపరిచింది. ఈ కార్యక్రమంలో పిఎంసి చైర్మన్ అమల, మండల విద్యా వనరుల అధికారి కె.రమణ, సిఆర్‌పిలు వెంకటేష్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు చిలుకూరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. దేవరపల్లిలో మహనీయులు ఆశయాల కమిటీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఉండవల్లి కృష్ణారావు మాట్లాడారు. మహిళా విద్యను ప్రోత్సహించిన మహోన్నత వ్యక్తి సావిత్రిబాయిపూలే అన్నారు. ఈ కార్యక్రమంలో రత్నాజీ, ఎన్.రామారావు, ఎన్.జలజాక్షి పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎ జ్యోతుల చంటిబాబుకు వినతిపత్రం అందిస్తున్న 108 సిబ్బంది

సమస్యలపై 108 సిబ్బంది ఎంఎల్‌ఎకు వినతి

ప్రజాశక్తి–గోకవరం

సమస్యలను పరిష్కరించాలంటూ 108 సిబ్బంది ఎంఎల్‌ఎ జ్యోతుల చంటిబాబుకు వినతిపత్రం అందించారు. ఎంపిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో పాల్గొన్న ఎంఎల్‌ఎను వారు జడ్‌పిటిసి దాసరి శ్రీరంగంరమేష్, ఎంపిపి సుంకర శ్రీవల్లి ఆధ్వర్యంలో బుధవారం కలిశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జీతాలు సకాలంలో రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. అవుట్‌సోర్సింగ్ లేద కార్పొరేషన్‌లో చేర్చి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూడాలని కోరారు.

సమిష్టి కృషితో సిఎం సభ జయప్రదం

ఎంపి మార్గాని భరత్‌రామ్

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం

సిఎం సభ విజయవంతానికి వైసిపి శ్రేణుల సమిష్టి కృషి, ప్రజల అభిమానమే కారణమని ఎంపి భరత్ అన్నారు. బుధవారం ఎంపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో ఇంత పెద్ద ఎత్తున బహిరంగ సభ నిర్వహించినా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పార్టీ నేతలు, కార్యకర్తలు ఎంతో ప్రత్యేక శ్రద్ధ వహించారన్నారు. వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సిఎం సభ విజయవంతానికి ప్రజలకు జగన్‌పై ఉన్న అభిమానమే కారణమన్నారు. సుమారు లక్షకు పైగా ప్రజలు జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చారన్నారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తామన్నారు. పార్టీకి మరింత గౌరవం తీసుకొచ్చేలా పనిచేస్తామని తెలిపారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్

జనాన్ని తరలించి, బయటకు రాకుండా నిర్బంధించినట్లు ఎల్లో మీడియా చేస్తున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. పెన్షన్ల పెంపు వారోత్సవాలు ఒక పండుగ వాతావరణంలో రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్నాయని, దీన్ని ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయన్నారు. ఈ సమావేశంలో వైసిపి నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, పి.శ్రీను, ఎం.అప్పారావు, సంకిస భవానీప్రియ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రగ్గుల పంపిణీ

చాగల్లు : చాగల్లు జడ్‌పి హైస్కూల్‌లో తానా అసోసియేషన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, చాగల్లు జడ్‌పిహెచ్‌ఎస్ పూర్వ విద్యార్థి గారపాటి విద్యాధర్, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ చైర్మన్ సుంకవల్లి ప్రమీలరాణి, ఆమె కుటుంబ సభ్యులు 920 మంది విద్యార్థులకు రూ.2లక్షల విలువైన రగ్గులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పాఠశాల ఆవరణను అభివద్ధి చేస్తానని, రక్షిత మంచినీటి ట్యాంకును నిర్మిస్తానని, క్రీడాకారులను ప్రోత్సహిస్తానని తెలిపారు. పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు తన దష్టికి తీసుకొస్తే తానా సంఘం సహకారంతో నెరవేర్చడానికి కషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలోతణుకు మాజీ ఎంఎల్‌ఎ ఎ.రాధాకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పాఠశాలకు సేవలందిస్తున్న విద్యాసాగర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పి.వీర్రాజు, పిఎంసి చైర్మన్ ఎం.భగవాన్, సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జూదాలు నిర్వహిస్తే చర్యలు

పెరవలి : సంక్రాంతి పండుగ పేరుతో జూదాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ సూర్య భగవాన్ అన్నారు. మండలంలోని ఖండవల్లి, అన్నవర ప్పాడు, నల్లాకులవారిపాలెం, ముక్కామల, అజ్జరం తదితర గ్రామాల్లో జూదాల నివారణకు గురువారం తహశీల్దార్ టి.రాజేశ్వరి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.

బ్రెయిలీకి ఘన నివాళి

తాళ్లపూడి : సమాజంలో అంధుల కోసం బ్రెయిలీలిపి కనుగొన్న లూయిస్ బ్రెయిలీకి పలువురు ఘనంగా నివాళులర్పించారు. రాగోలపల్లి ఎంపీపీ పాఠశాలలో బ్రెయిలీ జయంతిని హెచ్‌ఎం దున్నా దుర్గారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. బ్రెయిలీని అందరూ ఆదర్శంగా తీసుకోవా లన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఈతకోట సత్యనారాయణ, ఆయా కుమారి పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం : మంత్రి వనిత

ప్రజాశక్తి – కొవ్వూరు రూరల్

అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. బుధవారం కొవ్వూరు పట్టణంలోని సంస్కృత పాఠశాలలో నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు పింఛన్లను ముఖ్యమంత్రి పెంచారన్నారు. గతంలో పెన్షన్ కోసం వద్ధులు, వికలాంగులు నానా ఇబ్బందులు పడేవారని, నేడు ఇంటికే పింఛను తెచ్చి అందిస్తున్నారన్నారు. జిల్లాలో 2023 జనవరి నుంచి మొత్తం 2,39,491 మంది పెన్షన్ లబ్ధిదారులకు రూ.66 కోట్లకు పైగా లబ్ధిని అందించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులున్నప్పటికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ సుభాషిణి, జడ్‌పి వైస్ చైర్మన్ పి.శ్రీలేఖ, మాజీ ఎంఎల్‌సి కె.శివరామకృష్ణ, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ వి.గంగాధరశ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ భావన రత్నకుమారి, వైస్ చైర్మన్లు ఎం.పద్మ, జి.అంజలీదేవీ, ఎంపిపిలు మట్టా వీరాస్వామి, జె.పోసుబాబు, రుత్తల భాస్కరరావు, డిఎల్‌డిఒ వి.శాంతామణి, ఎంపిడిఒలు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరులో లబ్ధిదారులకు పింఛను పంపిణీ చేస్తున్న మంత్రి వనిత

గోకవరం : అర్హులందరికీ పింఛన్లు లభిస్తాయని జగ్గంపేట ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. 10,172 మంది లబ్ధిదారులకు అలాగే నూతనంగా మంజూరైన 420 మందికి పింఛన్లను ఆనయ అదించారు. ఈ సందర్భంగా జ్యోతుల మాట్లాడారు. కులమతాలు, పార్టీలకతీతంగా అర్హులందరికీ ప్రభుత్వం పింఛను అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కెవిఎస్–ఎస్ఎస్.మూర్తి, ఎంపిపి సుంకర శ్రీవల్లి, వీరబాబు దంపతులు, జడ్‌పిటిసి దాసరి శ్రీరంగ రమేష్ దంపతులు, జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి సుబ్బారావు, వైసిపి మండల కన్వీనర్ పాటి రాంబాబు, దేవస్థానం చైర్మన్ బి.రాంబాబు, వ్యవసాయ మండలి కమిటీ చైర్మన్ బి.నాగవెంకటేశ్వరరావు, వైస్ ఎంపిపి ఎం.మైనర్‌బాబు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

దేవరపల్లి ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం పింఛన్ల పంపిణీని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఎల్‌ఎ తలారి వెంకట్రావు పాల్గొన్నారు. పింఛన్లు పంపిణీ చేసి ఆయన ఆట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు జగన్ పింఛన్లను దశలవారీగా పెంచుతున్నారన్నారు. ముఖ్యంగా ప్రభుత్వం అందించే ప్రతి పథకం పేదలందరికీ అందించాలని ఉద్దేశంతో సచివాలయం, వాలంటరీ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కెవికె.దుర్గారావు, ఎఎంసి చైర్మన్ జనార్ధనరావు, జడ్‌పిటిసి సభ్యులు స్వర్ణలత, సర్పంచ్ కడిమి వీరకుమారి, వైస్ ఎంపిపి కె.అరుణ, ఎంపిడిఒ కె.ఉమామహేశ్వరశర్మ, వైసిపి నాయకులు, కార్యకర్తలు, పెన్షన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

గోకవరంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంఎల్‌ఎ జ్యోతుల

దేవరపల్లిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంఎల్‌ఎ తలారి

సమావేశంలో మాట్లాడుతున్న ఫ్యాప్టో చైర్మన్ జయకర్

ఫ్యాప్టో చైర్మన్‌గా జయకర్

ప్రజాశక్తి–రాజమహేంద్రవరం

ఫ్యాప్టో జిల్లా చైర్మన్‌గా పి.జయకర్ నియమితులయ్యారు. స్థానిక యుటిఎఫ్ హోమ్‌లో బుధవారం ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) ఎన్నిక జరిగింది. ఎన్నికల పరిశీలకులుగా డిటిఎఫ్ నాయకులు నరహరి వ్యవహరించారు. ఈ ఎన్నికలో ఫ్యాప్టో చైర్మన్‌గా పి.జయకర్, సెక్రటరీ జనరల్‌గా పి.శేషబ్రహ్మం, డిప్యూటీ సెక్రటరీలుగా పి.శ్రీనివాస్, దుర్గారావు, ట్రెజరర్‌గా ఎం.లక్ష్మణరావు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ఎ.షరీఫ్, పి.సువర్ణరాజు, కె.డేవిడ్‌లివింగ్‌స్టన్, వి.మోహనకష్ణకుమార్, జెడిఐజె.డానియల్‌బాబు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జయకర్ మాట్లాడుతూ ఐక్య ఉద్యమాల ద్వారా ఉపాధ్యాయుల హక్కులు సాధించుకోవాలన్నారు. అందుకు ఉపాధ్యాయ సంఘాలన్నీ కలిసికట్టుగా పని చేద్దామని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యయుత పోరాటాల ద్వారా ఉపాధ్యాయుల న్యాయమైన హక్కులు సాధించొచ్చన్నారు. సెక్రటరీ జనరల్ శేష బ్రహ్మం మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. ఇటువంటి పరిస్థితి ఉపాధ్యాయ ఉద్యమంలో ఎప్పుడూ చూడలేదన్నారు. ప్రభుత్వం వాటిని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ ఎన్నికల్లో ఎస్‌టిఎఫ్ఐ జాతీయ కార్యదర్శి ఎన్.అరుణకుమారి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మహాసేన రాజేష్‌ను కలిసిన జన సైనికులు

ప్రజాశక్తి – కడియం

మండలంలోని వీరవరం గ్రామ జనసైనికులు ఆదిమూలం సాయిబాబా ఆధ్వర్యంలో మహాసేన రాజేష్‌ను ఉత్తరకంచిలో ఆయన స్వగహంలో బుధవారం కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ ఒక రాజకీయ పార్టీ నాయకుడి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొనడానికి రాజమహేంద్రవరం వచ్చిన రాజేష్‌పై భౌతిక దాడులకు పాల్పడడం తగదన్నారు. ఇటువంటి హేయమైన చర్యలను ప్రతిఒక్కరూ తీవ్రంగా ఖండించాలన్నారు. రాజేష్‌ను కలిసిన వారిలో యినుమర్తి ప్రభాత్, గంధం వీరబాబు, రుద్ర గణేష్, ముంగమూరి చినబాబు తదితరులున్నారు.

డిజిటల్ లైబ్రరీ ప్రారంభం

ప్రజాశక్తి – రాజానగరం

ఆదికవి నన్నయ యూనివర్శిటీ విసి ఆచార్య మొక్కా జగన్నాథరావు యూనివర్శిటీ క్యాంపస్‌లో డిజిటల్ లైబ్రరీని బుధవారం ప్రారంభించారు. దీనిపై విసి మాట్లాడుతూ డిజిటల్ లైబ్రరీలోని 25 కంప్యూటర్ సిస్టమ్స్, ఇంటర్నెట్ సదుపాయంతో జాతీయ, అంతర్జాతీయ, జర్నల్స్, బుక్స్ ఆన్‌లైన్ పరిశోధకులకు, విద్యార్థులకు, ఫ్యాకల్టీకి అందుబాటులో ఉంటాయన్నారు. బోటనీ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టిష్యూ కల్చర్ ల్యాబ్‌ను ప్రొఫెసర్ పి.మహేశ్వరి ప్రారంభించారు. అనంతరం దీనిపై ప్రొఫెసర్ మహేశ్వరి మాట్లాడుతూ టిష్యూ కల్చర్‌లో ఆధునిక పద్ధతులను ఉపయోగించి పరిశోధనలు జరపాలన్నారు. విద్యార్థులు వారు ఎంచుకున్న స్పెషలైజేషన్లో ఎక్కువ విజ్ఞానాన్ని సంపాదించుకోవాలనానరు. బోటనీ విభాగం కో–ఆర్డినేటర్ డాక్టర్ శామ్యూల్‌కుమార్, ఒఎస్‌డి ఎస్.టేకి, ప్రిన్సిపల్స్ ఆచార్య కె.రమణేశ్వరి, డాక్టర్ పెర్విన్, డాక్టర్ కెవి.స్వామి, డాక్టర్ ఎ.మట్టారెడ్డి, డాక్టర్ పి.విజయనిర్మల, డాక్టర్ డి.కళ్యాణి, లైబ్రరీ ఫ్యాకల్టీ అసోసియేట్ డాక్టర్ సతీష్ కుమర్ పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న ఎంఎల్‌ఎ జ్యోతుల

ప్రజాశక్తి –గోకవరం

గోకవరం దేవీచౌక్ సెంటర్‌లో దుర్గమ్మ ఆలయాన్ని ఎంఎల్‌ఎ జ్యోతుల చంటిబాబు బుధవారం సందర్శించారు. ఆలయంలో గోపురానికి వెండి తాపడం పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆలయంలో ప్రత్యేక పూజలలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సుంకర శ్రీవల్లి, జడ్‌పిటిసి సభ్యులు దాసరి శ్రీరంగరమేష్, జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి సుబ్బారావు, వైసిపి మండల కన్వీనర్ రాంబాబు, నాయకులు వరసాల ప్రసాద్, ఎ.నాగబాబు, ఎన్.నరసయ్య, చింతల అనిల్‌కుమార్, వైస్ ఎంపిపి మడికి మైనర్‌బాబు, సర్పంచ్, ఎంపిటిసి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కార్టూ‘నిజం’



సిఎం గారొస్తే.. నిధులు అడగాలనుకుంటున్నావా..? ఆయన రావడానికయ్యే.. ఖర్చుకే నిధుల్లేవయ్యా...!!!

జగన్ రాష్ట్ర ప్రజలను మోసం చేశారు

ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో టిడిపి నాయకులు

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం

ఎన్నికల హామీలను తుంగలో తొక్కి జగన్ ప్రజలను మోసగించారని టిడిపి నాయకులు అన్నారు. 4వ డివిజన్లో టిఎన్‌టియుసి జిల్లా మాజీ అధ్యక్షులు నక్కా చిట్టిబాబు, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవీవరప్రసాద్, డివిజన్ ప్రెసిడెంట్ బండారు శ్రీను ఆధ్వర్యంలో ‘ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్ పాల్గొన్నారు. తొలుత ఎన్‌టిఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం డివిజన్లోని ఇంటింటికీ వెళ్లి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జగన్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. విద్యార్థులు, వద్ధులని కూడా చూడకుండా బలవంతంగా బస్సులు ఎక్కించి మరీ ముఖ్యమంత్రి జగన్ సభలకు తరలించడం తగదన్నారు. జగన్ కొత్తగా రాష్ట్రంలో 6 లక్షల పెన్షన్లు రద్దు చేశారని,

ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

15 లక్షల రేషన్ కార్డులు తొలగించే పని ఉన్నారని తెలిపారు. మూడు రాజధానులు అంటూ ప్రాంతాల మధ్య చిచ్చు రేపుతున్నారన్నారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు పెట్టకూడదంటూ చీకటి జీవో ఇచ్చిన జగన్ రాజమహేంద్రవరంలో సభ ఎలా పెట్టారని ప్రశ్నించారు. అనంతరం సభ్యత్వ నమోదు కార్డులను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఛాంబర్ మాజీ అధ్యక్షులు దొండపాటి సత్యంబాబు, టీడీపీ మైనారిటీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ షేక్ సుభాన్, రాజమండ్రి పార్లమెంట్ టిఎన్‌టియూసీ కార్యదర్శి యాళ్ల శ్రీనివాస్, తెలుగు యువత రాజమండ్రి పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షులు వెల్లంకి జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

పెరవలి : అన్నవరప్పాడులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందాడు. మల్లేశ్వరం గ్రామానికి చెందిన బోడపాటి మారియ్య(55) ఈ నెల 2న పెరవలి వైపు నుంచి అన్నవరప్పాడుకు బైకుపై వెళ్తుండగా అన్నవరప్పాడు వెంకటేశ్వర స్వామి దేవస్థానం వద్దకు వచ్చే సమయానికి రోడ్డు దాటుతున్న తణుకు టౌన్‌కు చెందిన వైట్ల విశ్వేశ్వరరావు(64)ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఇరువురూ గాయపడ్డారు. వారిని 108లో తణుకు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మారియ్య పరిస్థితి విషమంగా ఉండటంతో ఏలూరు ఆశ్రమం ఆసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం అక్కడ నుంచి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మారియ్య భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ ఎం.సూర్య భగవాన్ తెలిపారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

పెరవలి : మండలం గవళ్లపాలెం గ్రామానికి చెందిన కాండ్రేకుల సత్యనారాయణ(62) మనస్థాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సత్యనారాయణకు మూడు నెలల క్రితం పక్షవాతానికి గురయ్యాడు. నయం కావకపోవడంతో మనస్తాపం చెంది పురుగుమందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడనుండి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ ఎం.సూర్యభగవాన్ తెలిపారు.

నూటన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

ఘనంగా న్యూటన్ జయంతి

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య విద్యా సంస్థల ప్రాంగణంలో ఆదిత్య గ్రంథాలయ మరియు ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో న్యూటన్ 380వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ జ్యోతి ప్రజ్వలన చేసి, న్యూటన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి కే. మనోజ్ కుమార్ రెడ్డిలు మాట్లాడుతూ న్యూటన్ ఒక ఆంగ్ల, గణిత, భౌతిక శాస్త్రవేత్త, ఖగోళవేత్త, వైజ్ఞానిక విప్లవానికి శ్రీకారం చుట్టిన శాస్త్రవేత్త సర్ ఐజాక్ న్యూటన్ చరిత్రలో గురుత్వాకర్షణ శక్తిని సౌర కుటుంబ చలనానికి మూల సూత్రాన్ని ఆవిష్కరించి, చీకట్లను పారద్రోలిన మహనీయుడని, అంతరిక్ష పరిశోధనలో ఆయన సూత్రాలు ఎంతగానో ఉపయోగ పడుతున్నాయి అన్నారు. కార్యక్రమంలో డిపార్ట్మెంట్ అఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీ రింగ్, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ వారు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.ఎస్.వి.వి.ఎస్. కుమార్, వివిధ విభాగాధిపతులు, గ్రంథాలయ అధికారి కె.వి. రమణ, ప్రొఫెసర్ ఉమా ఫణీంద్ర కుమార్, ఫాకల్టీ, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు, పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సత్కరిస్తున్న సమితి సభ్యులు

మహిళా ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మండలం పెదబ్రహ్మదేవం గ్రామంలో సావిత్రిబాయి పూలే 192 వ జయంతి సందర్భంగా కాపు ఉద్యోగ సేవా సమితి ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన పలువురు మహిళా ఉపాధ్యాయులన సత్కరించారు. ముగ్గురు మహిళా ఉపాధ్యాయినులు ఎం. ప్రశాంతి, యడ్లపల్లి మాలతి, తోటకూర చంద్రకళలను సమితి ప్రతినిధులు ఘనంగా సత్కరించి అవార్డులను అందజేశారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, పెద్దాపురం నియోజకవర్గం వైసీపీ ఇంచార్జ్ దవులూరి దొరబాబు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత తోటకూర సాయి రామకృష్ణ, టి.వి.వి. సత్య నారాయణలు వీరిని అభినందించారు.

ఉపాధ్యాయులను సత్కరిస్తున్న సమితి సభ్యులు

క్రీడాకారునికి ప్రోత్సాహం

ప్రజాశక్తి-కరప

నేషనల్ అథ్లెటిక్స్ మీట్‌కి ఎంపికైన వాసంశెట్టి మహావీర్ అజితేష్‌కు క్రీడా పోటీలకు వెళ్లేందుకు ఆర్థిక సహాయం అందించినట్లు హెచ్‌ఎం లీలా మనో హర్ తెలిపారు. వచ్చే నెల ఫిబ్రవరి 10వ తేదీన బీహార్ రాజధాని పాట్నాలో ఆంధ్ర ప్రదేశ్ తరపున అక్కడకు వెళ్లేందుకు అవసరమైన సొమ్ములు లేకపోవ డంతో దాతల సాయం కోరాడు. స్పందించిన కరప గ్రామానికి చెందిన మేడపాటి నాగ వీర సుబ్బారెడ్డి (చంటి) 4 వేలు ఆర్థిక సాయం చేశారు. బుధవారం తన తండ్రి మేడపాటి నారాయణరెడ్డి చేతుల మీదుగా ఆ విద్యార్థికి అందజేశారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పరుగు పందెం పోటీలకు వెళ్లినప్పుడు ఆ విద్యార్థికి స్పోర్ట్స్ షూ కూడా సుబ్బారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో పీడీ శ్రీనివాస్, పిఈటి రమేష్, ఉపాధ్యాయులు సుదర్శన్ బాబు, టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సాంప్రదాయ వస్త్రధారణలో కళాశాల విద్యార్థినులు

ఉత్సాహంగా సంప్రదాయ వస్త్రధారణ పోటీలు

ప్రజాశక్తి-కొత్తపేట

విశ్వ కవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు మహిళా సాధికారిత విభాగం, సాంస్కృతిక విభాగం సంయుక్త ఆధ్వర్యంలో అరుణ్ కుమార్ అధ్యక్షతన సాంప్రదాయ వస్త్రధారణ పోటీలు బుధవారం నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ సాంప్రదాయ వస్త్రధారణ వలన మన సంస్కృతి ఆచార వ్యవహారాలు సాంప్రదాయాల విలువలు మరింత ప్రాధాన్యతను సంతరించుకుంటాయని అన్నారు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బోటని అధ్యాపకులు ఎన్. నాగేశ్వరావు, కామర్స్ అధ్యాపకులు కె.సత్యనారాయణ, మహిళా సాధికారత విభాగం కన్వీనర్ టి. రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-మండపేట

తాపేశ్వరం గ్రామ పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు యూనిఫామ్, దుస్తులను గ్రామ సర్పంచ్ వాసంశెట్టి రాజేశ్వరి బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రతలో పారిశుధ్య కార్మికులు చేస్తున్న సేవలు వెలకట్టలేని అన్నారు. చెత్తను కార్మికులకు అందించడంలో గ్రామ ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి పి.శ్రీనివాసు, సచివాలయ సిబ్బంది, పి.నీలిమ తదితరులు పాల్గొన్నారు.

దుస్తులు అందజేస్తున్న సర్పంచ్ రాజేశ్వరి

అర్హులకు పథకాలు అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

అర్హులైన వారందరికీ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఎం ఎల్ సి తోట త్రిమూర్తులు అన్నారు. పడమర ఖండ్రికలో బుధవారం నిర్వహించిన గడప..గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి సభ్యురాలు మేడిశెట్టి సత్యవేణి, జెడ్‌పిటిసి సభ్యులు పుట్టపూడి వీర వెంకట సూర్యనారాయణ,, గ్రామ సర్పంచ్ తిరునాతి ఆదిలక్ష్మి వెంకటేశ్వరరావు , ఎంపిటిసి సభ్యురాలు పి.శేషరత్నం, తదితరులు, పాల్గొన్నారు .

ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్‌ఎల్‌సి తోట

ఆర్థిక సహాయం అందిస్తున్న కమిటీ సభ్యులు

చేనేత కార్మికునికి సాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

పక్షవాతానికి గురైన స్థానిక వీర్రాజు పేటకు చెందిన చేనేత కార్మికుడు కర్రా అప్పారావుకు చేనేత వర్గాల ముప్పన రామారావు కమ్యూనిటీ భవనం ఆధ్వర్యంలో బుధవారం రూ.10 వేలు వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందించారు. కమిటీ అధ్యక్షుడు జెట్టి వీర వెంకట సత్యం(రాజబ్బాయి) మాట్లాడుతూ తమ సంఘం తరపున చేనేత వర్గాలకు సంబంధించి అవసర మైన వారికి ఆర్థిక సహాయం, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సేవా కార్యక్రమాలు మరింతగా విస్తరించేందుకు కషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బనిశెట్టి సత్యానారాయణ,చల్లా బ్రహ్మాజీరావు, నక్కిన భద్రరావు, ధోర నాగేశ్వరరావు, అల్లాడ రామకృష్ణ, చల్లా సత్య నారాయణ, బొమ్మన సత్యానారాయణ పాల్గొన్నారు.

ప్రమాణస్వీకారం చేసిన వీడియోగ్రాఫర్స్ నూతన కార్యవర్గం

సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ది ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ రిలేటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని ఎంఎల్‌సి చిక్కల రామచంద్రరావు అన్నారు. క్షత్రియ పరిషత్‌లో బుధవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గౌరవ అధ్యక్షులు మధు శీను, నూతన అధ్యక్ష కార్యదర్శులు వీరేంద్రకుమార్, బి.కోటేశ్వరరావు, కోశాధికారి ఎన్‌వి భాస్కర రావు, కాకినాడ నూతన కార్యవర్గం గౌరవ అధ్యక్షులు పొన్నగంటి శ్రీనివాస్, అధ్యక్ష కార్యదర్శులుతోట సూర్య సుబ్బారావు, సయ్యద్ ఖమ్రుజమ, కోశాధికారి పేపకాయల వీరభద్రరావు, అడబాల రాజేష్, శ్రీను, నరసింహరాజు, శ్రీనివాస రావు, షేక్ గౌసుతోపాటు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

అన్నప్రాసన చేయిస్తున్న అంగన్‌వాడీ వర్కర్ సూర్యకుమారి

అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసనలు

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణంలోని వరహాలయ్యపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అంగన్‌వాడీ వర్కర్ జాగారపు సూర్యకుమారి ఆధ్వర్యంలో బాలలకు అన్న ప్రాసనలు జరిపారు. కార్యక్రమంలో మంచిన డోలానంద్, తల్లులు విజయ లక్ష్మి, సత్యవతి,సంధ్య, నాగలక్ష్మి, వీరమణి, ఆయా ఎం.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి విశ్వరూప్

సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి -ఉప్పలగుప్తం

ప్రజాసంక్షేమమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పినిపే విశ్వరూప్ సూచించారు. గొల్లవిల్లిలో బుధవారం వైసిపి మండల అధ్యక్షుడు బద్రి బాబ్జి అధ్యక్షతన సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు, పార్టీ ప్రజా ప్రతి నిధులు, నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేరవేస్తున్న వాలంటీర్లను ఈ సందర్భంగా సంక్షేమ సారథులుగా మంత్రి విశ్వరూప్ పేర్కొన్నారు. సచివాలయానికి ముగ్గురు కన్వీనర్లను నియమించామని ప్రతి వాలంటీర్ పరిధిలో ఇద్దరు గృహసారథుల్ని నియమించినట్టు ఆయన తెలిపారు. సమావేశంలో పాల్గొన్న మంత్రి విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్, జెడ్‌పిటిసి సభ్యుడు గెడ్డం సంపదరావు, సర్పంచ్ ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, సర్పంచ్‌లు జొన్నాడ శ్రీ దుర్గ, యర్రంశెట్టి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

దుర్మార్గపు పాలన సాగిస్తున్న వైసిపి

ప్రజాశక్తి -ఉప్పలగుప్తం

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం దుర్మా ర్గపు పాలన సాగిస్తోందని వాటిని తిప్పికొట్టాలని అమ లాపురం నియోజ కవర్గం టిడిపి ఇన్ ఛార్జ్, మాజీ ఎమ్‌ఎల్ అయితాబత్తుల ఆనందరావు పిలుపునిచ్చారు. కుప్పంలో మాజీ సిఎం చంద్రబాబు పర్యటనను అక్రమంగా అడ్డుకున్నారంటూ మాజీ ఎమ్‌ఎల్‌ఎ ఆనందరావు ఆధ్వర్యంలో బుధవారం రాత్రి గొల్లవిల్లి సెంటర్ లోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద టిడిపి శ్రేణులు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. అంతకుముందు అమ్మన్న అగ్రహారంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు. **కొత్తపేట** రాష్ట్రంలో ప్రతిపక్షం సభలను, సమావేశాలను అడ్డుకోవాలనే రాష్ట్ర ప్రభుత్వం జిఒ నెం.1 ఒకటి తెచ్చిందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యానందరావు అన్నారు. అవిడి, పలివెల గ్రామాలలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. టిడిపి నాయకులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుల నిరసన

సెజ్ భూముల సర్వే వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ ప్రత్యేక ఆర్థిక మండలి (కెఎస్ఈజెడ్) భూములకు సంబంధించి సర్వేను వేగవంతం చేసి రైతుల పేరున భూమిని రిజిస్ట్రేషన్ చేయించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టరు డా. కతికా శుక్లా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కతికా శుక్లా జాయింట్ కలెక్టరు ఎస్. ఇలక్కియ, ఇతర రెవెన్యూ, ప్రైవేట్ సంస్థల ప్రతి నిధులతో కలిసి కెఎస్ఈజెడ్ భూములు సర్వే, రిజిస్ట్రేషన్ ఇతర అంశాలపై ప్రైవేట్ సంస్థల ప్రతినిధులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో ఎస్ఈజెడ్ భూములకు సంబంధించి భూముల సర్వే, రిజిస్ట్రేషన్ పనులను పూర్తిచేసి రైతులకు అప్పగించే పనులు వేగవంతం చేయాలన్నారు. యూ.కొత్తపల్లి మండలాలకు సంబంధించి భూమి డి-నోటిపై అయిందని, యూ. కొత్తపల్లి, తొండంగి మండలాల్లో ఇప్పటి వరకు 384 ఎకరాల్లో సర్వే, రిజిస్ట్రేషన్ పనులు పూర్తిచేసి రైతులకు భూమి అప్పగించినట్లు తెలిపారు. అదేవిధంగా రైతులకు ఇచ్చే ప్రత్యామ్నాయ భూమికి సంబంధించి 283 ఎకరాల్లో రిజిస్ట్రేషన్ పనులు పూర్తి చేసినట్లు కలెక్టరు తెలిపారు. ఇంకా మిగిలిన భూములకు సంబంధించి సర్వే, రిజిస్ట్రేషన్ పనులను ముమ్మరంగా చేపట్టి రైతులకు భూమిని అప్పగించే విధంగా చూడాలన్నారు. ఇందుకు కెఎస్ఈజెడ్, రెవెన్యూ, సర్వే, రోడ్లు, భవనాలు, ఇరిగేషన్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. సమావేశంలో కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు బీవీ రమణ, జె.సీతారామారావుబీ అరబిందో గ్రూప్ ప్రతినిధులు సీఆర్ఎం నాయుడు, వి.దుర్గాప్రసాద్, ఎం.శ్రీనివాసు రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందిస్తున్న కమిటీ సభ్యులు

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని ధర్నా

ప్రజాశక్తి - కోటనందూరు

తుఫాను ప్రభావంతో తడిసిపోయిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయా లని డిమాండ్ చేస్తూ తుని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ యనమల కృష్ణుడు రైతులతో కలిపి బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో 10 కేజీల తరుగు తీసుకోవడాన్ని రైతులను మోసం చేయడమేనని, ఈ పద్ధతి వెంటనే మార్చాలని సూచించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్ కె.కిరణ్ కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి డి.చిరంజీవిరాజు, అంకమరెడ్డి రమేష్, షేక్ నవాజ్ జానీ హెూన్నీసా, లెక్కల భాస్కర్, అంకమరెడ్డి బుల్లిబాబు, పెనుముచ్చ నాగేశ్వరరావు, శ్రీరామ్ మూర్తి, మాతిరెడ్డి బాబులు, ఎల్ ఎస్ ఎన్ మూర్తి, ఆర్. శ్రీనివాస్ బోడపాటి సత్యనారాయణ, అల్లంపల్లి నరసింహమూర్తి, నెమ్మది సత్యనారాయణ పాల్గొన్నారు.

రైతులు, తెలుగుదేశం నాయకులతో కలిసి ధర్నా నిర్వహిస్తున్న కృష్ణుడు

బహుమతులు అందజేస్తున్న ఎంఇఒ శివరామకృష్ణయ్య

పెద్దాపురం బ్రెయిలీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, విద్యార్థులు

అంధుల అక్షర ప్రదాత బ్రెయిలీ

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

అంధుల అక్షర ప్రదాత లూయిస్ బ్రెయిలీ అని సామర్లకోట మండల విద్యాశాఖాధికారి వై శివ రామకృష్ణయ్య పేర్కొన్నారు. బుధవారం సామర్ల కోట మండల 'భవిత' కేంద్రంలో లూయాస్ బ్రెయిలీ జయంతిని నిర్వహించారు. ఎంఇఒ శివరామకృష్ణయ్య మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ జీవిత చరిత్రను దివ్యాంగ విద్యార్థులకు, తల్లిదండ్రులకు వివరించారు. ప్రస్తుతం భవిత కేంద్రంలో అంధ 'చెయివీ' లిపికి విద్యను అందిస్తున్నారని, ఈ సేవలను విద్యార్థుల తల్లిదండ్రులు వినియోగించు-కోవాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతులను అందజేశారు. విద్యార్థుల తల్లి దండ్రులు, కంప్యూటర్ ఆపరేటర్, ఎంఐఎస్, సిఆర్పీలు, భవిత సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దాపురం మహాత్మా గాంధీ మున్సిపల్ పాఠశాలలోని భవిత కేంద్రంలో బుధ వారం జనవరి 4 లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా అంధురాలైన కట్టమూరు దుర్గ అనే బాలిక కేక్ కట్ చేసి ఈ వేడుకలను ప్రారంభించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెద్దాపురం డివిజన్ అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ ఏ.కాళీ కృష్ణ, ఎంఇఒ సిహెచ్‌వివి సత్యనారాయణ, వినియోగదారుల సంఘం అధ్యక్షులు భళ్లమూడి సూర్యనారాయణమూర్తి, హెచ్ఎం ఎం ఎల్ శివజ్యోతిలు లూయిస్ బ్రెయిల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భవిత సిబ్బంది బి దుర్గా ప్రసాద్ రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి - కాజులూరు

ప్రభుత్వం అందించే పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రసన్న మౌనిక అన్నారు. గొల్లపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో హెచ్ఎం వెంకటలక్ష్మి అధ్యక్షతన ఎనిమిదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు 102 ట్యాబ్‌లను గొల్లపాలెం సర్పంచ్ పోతురాజు ప్రసన్న మౌనిక విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో గుబ్బల యేసురాజు తాడి వీర వెంకటరెడ్డి పోతురాజు బాబురావు, పిఇటి సునీల కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

6న కర్నూల్లో అథ్లెటిక్ పోటీలు

ప్రజాశక్తి-అమలాపురం

ఎపి క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి రెండవ దశ అథ్లెటిక్ పోటీలు ఈనెల 6న కర్నూలులో నిర్వహించేందుకు నిర్ణయించారని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకులు సురేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలు అథ్లెటిక్‌లో 100 మీ, 400మీ, 1500మీ లాంగ్ జంప్, షార్ట్ కట్ ఈవెంట్ల లో జరుగుతాయన్నారు. ఈ పోటీలు పురుషులు, మహిళా విభాగాల్లో ఓపెన్ కేటగిరిలో జరుగుతాయన్నారు. పాల్గొనే క్రీడాకారులకు ఎంట్రీ ఫీజు రూ.200లుగా నిర్ణయించారన్నారు. వివరాలకు జిల్లా అథ్లెటిక్ క్రీడాకారులు రవితేజ 9533759114 నెంబరులో సంప్రదించాలన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -ఉప్పలగుప్తం

విద్యుత్ షాక్ తో వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు కథనం ప్రకారం చల్లపల్లి కి చెందిన వివాహితుడు కుసుమ స్వామి వరప్రసాద్(32) బుధవారం తన ఇంటి వెనుక ఉన్న రొయ్యల చెరువు గట్టుపై ఉన్న గడ్డిని తొలగిస్తున్నాడు. అయితే ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ కు గురయ్యాడు. కుటుంబీకులు అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే వరప్రసాద్ మృతి చెందినట్టు వైద్యులు తెలిపారాన్నారు. మతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నట్టు ఆయన తెలిపారు. మతిని సోదరుడు శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పోక్సో కేసులో 20 ఏళ్ల జైలు

ప్రజాశక్తి-మండపేట

పోక్సో కేసులో నిందితుడు రమణకు జిల్లా పోక్సో కోర్టు 20 సంవత్సరాల జైలు, రూ.3 వేల జరిమానా విధించినట్లు రూరల్ ఎస్ఐ శివకష్ణ తెలిపారు. గత సంవత్సరం ఆగస్టు నెలలో మండలంలోని ద్వారపూడి శివారు వేములపల్లి కోళ్ల ఫారాల వద్ద ఇంటి బయట ఆడుకుంటున్న మైనర్ బాలికను చాక్లెట్ ఇచ్చి ఇంటిలోనికి తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు రమణ. బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి రమణను పోక్సో చట్టంపై అదుపులోని తీసుకుని కోర్టులో హాజరు పరచగా జడ్జి ఎల్.వెంకటేశ్వరరావు నిందితునికి 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.3 వేల జరిమానా విధించింది. ఈ కేసు దర్యాప్తులో పాల్గొన్న అందరిని జిల్లా ఎస్‌పి అభినందించారు.

22 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి -మండపేట

పట్టణ పరిసర ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్న ఐదుగురు ముఠా సభ్యులను బుధవారం అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 22 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సిఐ పి. శివగణేష్ తెలిపారు. బుధవారం పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోలీసులకు వచ్చిన సమాచారంపై స్థానిక ఆలమూరు రోడ్డులో టోల్ గేట్ వద్ద గంజాయి విక్రయిస్తున్న వీరిని అదుపులోకి తీసుకున్నారు. అనపర్తికి చెందిన కె.సతీష్ రెడ్డి, జె.జగదీష్, దుప్పలపూడికి చెందిన కె.ఆజయ్ గోపాలకష్ణ, పసలపూడికి చెందిన ఇద్దరు మైనర్లను ఉన్నారని తహసీల్దారు టి.రాజేశ్వరరావు సమక్షంలో వీరిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండపేట సిఐ శివ గణేష్, ఎస్ఐ ఎం. అశోక్ తెలిపారు. గతంలోనూ వీరు గంజాయి విక్రయాలు జరిపారని ఎవరెవరికి విక్రయించారనే దానిపై విచారణ కొనసాగుతుందన్నారు.

ప్రకటన

కాకినాడ జిల్లా, ఏలేశ్వరం మండలం, పెద్దనాపల్లి కాపురస్తులు గొల్లపల్లి అచ్యుతరామారావు గారి కుమారుడు **గొల్లపల్లి నరసింహమూర్తి** అలియాస్ **బుజ్జి** అయిన నేను యావన్మందికి తెలియ జేయునది ఏమనగా,

నాకు సంబంధించిన ది.**28-12-2022** తేదీన సాయంత్రం సుమారు 7.00 గంటల సమయంలో కిర్లంపూడి నుండి ద్విచక్రవాహనంపై రాజుపాలెం గ్రామం వెళుతుండగా రాజుపాలెం గ్రామం వచ్చేసరికి నా వాహనంలో పెట్టుకున్న బ్యాగ్ కనిపించలేదు. మార్గమధ్యలో ఎక్కడో పడిపోయినది. ఆ బ్యాగ్‌లో యర్రవరం స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ నా అకౌంటుకు సంబంధించిన నేను సంతకం చేసిన చెక్కు నెం.**468134** మరియు చెక్కు నెం.**468135**లు గల 2 చెక్కులు, నేను సంతకం చేసిన 2 ప్రామిసరీ నోటులు 2021 సంవత్సరం జనవరి నెలలో కొనుగోలు చేసినవి, నేను సంతకం చేసిన రెండు 100 రూపాయల విలువగల నాన్‌జ్యుడీషియల్ స్టాంపులు ఉన్నవి. సదరు బ్యాగ్ ఎవరికైనను దొరికినచో ఈ క్రింది అడ్రసుకు అప్పగించి తగిన పారితోషకం పొంద వలసిందిగాను, అలా కాకుండా అక్రమ లాభము పొందుటకు సదరు చెక్కులు, ప్రామిసరీ నోట్లు, రూ.100 నాన్ జ్యుడీషియల్ స్టాంపులు నాకు వ్యతిరేకంగా వినియోగించినట్లయితే అవి ఏమియూ నన్ను బైండు చేయవని, అట్టివారిపై సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకొనబడునని ఈ ప్రకటన ద్వారా యావన్మందికి తెలియజేయడమైనది.

గొల్లపల్లి నరసింహమూర్తి
S/o. అచ్యుతరామారావు, పెద్దనాపల్లి,
ఏలేశ్వరం మండలం, సెల్: 9949689999

PROCLAMATION PUBLICATION
Filed under sec. 82 Cr.P.C.

మహారాజశ్రీ 5వ అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వారి కోర్టు : కాకినాడ

D.V.C. No. 24/2019

Between :
దోమ కామేశ్వరి ...పిటీషనర్
మరియు
దోమ గంగాధరరావు మరియు ఇతరులు ...రెస్పాండెంట్స్

R_1 : **దోమ గంగాధరరావు,**
S/o. కొండయ్య,
డో.నెం. 2-51, భైరవపాలెం,
ఐ. పోలవరం మండలం.

పై కేసులో 1వ ప్రతివాది అయిన మీరు కోర్టు నుంచి ఎన్నిసార్లు సమన్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. **ది. 10-01-2023వ తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** మీరు శ్రీ కోర్టువారి ఎదుట హాజరయ్యి మీ ఆక్షేపణలు తెలియజేయగలరు. అట్లు కానిచో మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

|| బై కోర్టు ఆర్డర్ ||

M.R. SHARIEF
P. SATISH KUMAR, Advocates
D.No. 12-2-25, Dantuvari Street,
KAKINADA. Cell: 99486 66679

పారిశుధ్య కార్యదర్శికి షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు బుధవారం మూడవ సర్కిల్ పరిధిలోని ఏడవ డివిజన్లో పర్యటించిన అక్కడి పారిశుధ్య పనుల నిర్వహణా తీరుపై తీవ్ర అసంతప్తి వ్యక్తం చేశారు. అక్కడి శానిటరీ సెక్రటరీ, ఇతర సిబ్బంది పని తీరుపై తీవ్ర అసంతప్తి వ్యక్తం చేశారు. ఈ విషయంలో సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్, సచివాలయ శానిటరీ కార్యదర్శి ప్రత్యేక బాధ్యత తీసుకుని ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. అవసరమైతే పెనాల్టీలు కూడా విధించాలని ఆదేశించారు. పనుల్లో అలసత్వంపై అక్కడి శానిటరీ సెక్రటరీకి షోకాస్ నోటీసు ఇవ్వాలని ఆదేశించారు. పరిస్థితి మారకపోతే మరిన్ని కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ వర్మ, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

మహారాజశ్రీ పిఠాపురం 12వ అడిషనల్ జిల్లా జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్. నెం. 5/2020, ఐ.ఎ. నెం.329/2020

బిట్వీన్
(1) పాకలపాటి నాగ వెంకట వైష్ణవి
(2) పాకలపాటి కృష్ణ నిహారిక
(1,2 వార్లు మైనర్లు అయినందున గార్డియన్‌గా తల్లి పాకలపాటి సుజాత) ... పిటీషనర్లు
మరియు
పాకలపాటి రామకృష్ణంరాజు వగైరాలు .... రెస్పాండెంట్లు

44వ రెస్పాండెంటు:
మేడిబోయిన గణేష్ s/o పద్మరాజు, డోరు నెం. 1-140, కృష్ణాపురం గ్రామం, తొండంగి మండలం, కాకినాడ జిల్లా.

ప్రకటన

పై నెంబరు పిటీషనులో మీకు కోర్టు నుండి ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ అవి తీసుకొనక నిరాకరించి నందున పై కోర్టు వారు మీ హాజరు నిమిత్తం ది.19.01.2023వ తేదీకి వాయిదా వేసినారు. కావున మీరు సదరు వాయిదా రోజున ప్రత్యక్షంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట ఉదయం 10:30 ని॥లకు హాజరైయ్యి మీకేమయినా ఆక్షేపణలు వున్నచో తెలియజేసుకొన వలెను, లేనిచో మీ పరోక్షమున శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

వాయిదా తేది.19.01.2023
(శ్రీ కోర్టు వారి అనుమతితో)
సలుగు కృష్ణ శేఖర్
అడ్వకేట్
తుని, కాకినాడ జిల్లా.
సెల్ నెం. 9848354568

మహారాజశ్రీ పిఠాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి.నెం.66/19, ఓ.ఎస్.నెం.60/17

బిట్వీన్
గుండుబిల్లి దొరబాబు ..... డిక్రీ హోల్డర్
మరియు
సందిన అప్పారావు మరియు మరియొకరు .... జడ్జిమెంట్ డెటార్స్

జెడిఆర్స్-1 సందిన అప్పారావు s/o వెంకటరత్నం డోరు నెం.2-122, బిసి కాలనీ, గొల్లప్రోలు, గొల్లప్రోలు మండలం, కాకినాడ జిల్లా
(2) సందిన శివ s/o అప్పారావు, డోరు నెం. 2-122, బిసి కాలనీ, గొల్లప్రోలు, గొల్లప్రోలు మండలం, కాకినాడ జిల్లా

ప్రకటన

పై నెంబరు అమలు పిటీషనులో మీకు కోర్టు నుండి ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ అవి తీసుకొనక నిరాకరించినందున పై కోర్టు వారు మీ హాజరు నిమిత్తం ది.06.01.2023వ తేదీకి వాయిదా వేసినారు. కావున మీరు సదరు వాయిదా రోజున ప్రత్యక్షంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట ఉదయం 10:30 ని॥లకు హాజరైయ్యి మీకేమయినా ఆక్షేపణలు వున్నచో తెలియజేసుకొన వలెను, లేనిచో మీ పరోక్షమున శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

వాయిదా తేది.06.01.2023
(శ్రీ కోర్టు వారి అనుమతితో)
సలుగు కృష్ణ శేఖర్
అడ్వకేట్
తుని, కాకినాడ జిల్లా.
సెల్ నెం. 9848354568

మహారాజశ్రీ పిఠాపురం 12వ అడిషనల్ జిల్లా జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్. నెం. 5/2020

బిట్వీన్
(1) పాకలపాటి నాగ వెంకట వైష్ణవి
(2) పాకలపాటి కృష్ణ నిహారిక
(1,2 వార్లు మైనర్లు అయినందున గార్డియన్‌గా తల్లి పాకలపాటి సుజాత) ... వాద్లు
మరియు
పాకలపాటి రామకృష్ణంరాజు వగైరాలు .... ప్రతివాద్లు

44వ ప్రతివాది:
మేడిబోయిన గణేష్ s/o పద్మరాజు, డోరు నెం. 1-140, కృష్ణాపురం గ్రామం, తొండంగి మండలం, కాకినాడ జిల్లా.

ప్రకటన

పై నెంబరు దావాలో మీకు కోర్టు నుండి ఎన్నిసార్లు సమన్లు పంపిననూ అవి తీసుకొనక నిరాకరించి నందున పై కోర్టు వారు మీ హాజరు నిమిత్తం ది.19.01.2023వ తేదీకి వాయిదా వేసినారు. కావున మీరు సదరు వాయిదా రోజున ప్రత్యక్షంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట ఉదయం 10:30 ని॥లకు హాజరైయ్యి మీకేమయినా ఆక్షేపణలు వున్నచో తెలియజేసుకొన వలెను, లేనిచో మీ పరోక్షమున శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

వాయిదా తేది.19.01.2023
(శ్రీ కోర్టు వారి అనుమతితో)
సలుగు కృష్ణ శేఖర్
అడ్వకేట్
తుని, కాకినాడ జిల్లా.
సెల్ నెం. 9848354568